# సంత (సం)

కొంతలో కొంత మనకి వుండేది అవుట్‌డోర్ లైఫ్—ఏమాట కా మాటే చెప్పుగోవాలి. సంతలూ, సంబరాలూ, తీర్థాలూ, వూరేగింపులూ వీటి మాటేవిటి?

"సంతకు చీటీ లచ్చికి గాజులు" అని వేళాకోళం చేస్తే చేశారు కాని, నాకు సంతకు వెళ్ళటం చిన్నప్పట్నుంచి చెడ్డ సరదా. నాకేవిటి పిల్లలందరికి సంత కెళ్ళడం అంటె కొద్దో గొప్పో తమాషాగా వుండేది. వెస్ట్ గోదావరిలో బెస్టు సంతగూడెం సంత, సంతసం అనే మాట కూడా సంతలోంచే పుట్టి వుండాలి. ఇప్పుడు టింగురంగామని, షోగ్గా, నైసుగా, లవ్‌లీగా ముస్తాబయి జంటలు జంటలుగా తుంటరిగా—ముద్దులేసి ముక్కారు నగలూ ధరించి, మార్కెటింగ్ కని యధాశక్తి కాళ్ళనడకనూ, రిక్షాలిమీద, బస్సులు-స్కూటర్లు, చిన్న కార్లమీద పోతూ వున్నారు కాదా? యస్. యస్. పోతూ వున్నారు. ఇప్పుడు ఎక్కువ డబ్బు పట్టిగెళ్ళి తక్కువ సామాన్లు తెచ్చుగుంటున్నారు. అప్పుడు కొంచెం డబ్బుకి ఎక్కువ సామాన్లు తెచ్చుగునేవారు. వారంలో ఏదో ఒక రోజు వూళ్ళో సంత జరిగి తీరుతుంది. సంతరోజు మార్కెటింగ్ డే అని హాఫీసులా స్కూళ్ళూ కూడా హాఫ్‌హాఫ్ పన్చేసేవి. హాఫ్ వర్కిగ్ండే అంటె సంత శలవు. గూడెంలోనూ-పాలకొల్లులోనూ శనివారం, మార్టేరులో మంగళ

వారం, పెనుగొండలో బుధవారమూ యిట్లా సంతలు జరిగేవేమిటి నా మొహం—యిప్పుడు కూడా జరుగుతున్నాయి.

కమింగ్ టుది పాయింట్ సంత అంటే సరదా అని చెప్పాను కదా! సంత ఫిలాసఫీ కడు సంతసము గొల్పును. దూరాన్నుంచి గోలగా హడావిడిగా యమబిజీగా కనిపిస్తూ వుండే సంత అందులోకి మనం ఎంటరవగానే జీవుడు దేహంలోకి ప్రవేశించినట్లు అందలి సుఖదుఃఖములు మనకి అంటును. అంటవు.



సంతలో అంతా ఎవరి గొడవ వారిది. అంతా మాట్లాడుతూ వుంటారు. నవ్వుతూ వుంటారు, కేకలేస్తూ వుంటారు, గుసగుస లాడుతూ వుంటారు. నిగనిగలాడ్తారు, పకపకలాడ్తారు. క్రవుడ్ లోకి దూరిపోగానే ఆ క్రవుడ్ మనస్తత్వం మనకీ వచ్చేస్తుంది. ఆడాళ్ళని మగాళ్ళూ, మగాళ్ళని ఆడాళ్ళూ, పడుచువాళ్ళని కుర్రాళ్లూ వారిని వీరు వీరిని వారూ ఒకర్నొకరు త్రోసుకుంటూ కేకలేసుగుంటూ కొంప మునిగిపోయినట్లు తిరగటం గమ్మత్తుగా వుంటుంది. మెడ నెప్పేటట్లు యిటూ ఆటూ చూస్తూ కలర్స్‌ని ఎంజాయి చేయవచ్చు. గిరీశం గ్రాస్‌గరల్స్ మా డర్టిస్మెల్ అని వాపోయాడు కాని సంతలో కొచ్చే రకరకాల రంగుల బొంగరాల్లా కనపడే సేల్స్‌గరల్స్‌ని చూసి మెచ్చుకోలేకపోయాడు. సేల్స్‌గరల్స్ వాల్చూ

పులూ, చిరునవ్వులూ, మెడ తిప్పుకోవటాలూ వాళ్ళ జోక్స్ వాళ్ళ విట్స్ చూసి తీరవలయునే కాని వ్రాయనలవి కాదు.

"సరసము విరసముకొరకే—పరిపూర్ణ సుఖమ్ము లధిక బాధల కొరకే" అన్న ట్రూత్ గుర్తులేనివారు ముందు సరసాలకి దిగి ఆ తర్వాత ఇంజక్షన్ సూది దిగుతున్నప్పుడు పరిపూర్ణ సుఖమ్ము లధిక బాధల కొరకే అన్న నిజాన్ని తెలుసుకొంటారు.

సంతలో కొంత బిజినెస్సూ కొంత ఎంటర్‌టైన్‌మెంటూ, అనగా వ్యాపారమూ, వినోదమూ లక్ష్మీసరస్వతుల్లాగ కలిసీ మెలిసీ వుంటాయి. కొందరు డబ్బు సంపాదించటానికీ కొందరు డబ్బు ఖర్చు చేసుకోటానికి సంతలకు వస్తారు. ఉదయం పదీ పదకొండు పన్నెండు గంటల దాకా సంత ప్రారంభమవుతూ వుంటుంది. ఒంటిగంటనుంచి నాలుగున్నరదాకా మధ్యందిన మార్తాండుడిలాగ సంత విశ్వరూపం ధరిస్తుంది. ఆరుతర్వాత టెంపరేచర్ డవునై పోతుంది. బస్సులు, రైళ్ళు, సినిమా హాల్సూ కాఫీ హోటళ్లూ రోజు రోజంతా కిటకిట లాడిపోతాయి సంత బెగ్గర్స్‌కి కూడా బిజీడే. సంత పాకల్లో జాతీయ సమైక్యత బాగా కన్పిస్తుంది. అన్నివర్ణాలు జాతులు మతాలవారూ కలిసిపోయి తిరుగుతారు. యిచ్చి పుచ్చుగుంటారు. కొన్నవాడు లాభంగా కొన్నాననుకుంటాడు. అమ్మినవాడు లాభాని కమ్మానని సంతోషిస్తాడు. ఒకరి లాభం మరొకరికి నష్టం కదా-కాని ఉభయులూ సంతోషంగా తిరిగివస్తారు. దీన్నే భ్రాంతి (ఇల్యూజన్) అన్నారు. మనకి బీరకాయలు కావాల్సి వచ్చినపుడు ఎక్కడ చూసినా వంకాయలు కన్పిస్తాయి. బెండకాయలు కావాల్సి వచ్చినపుడు ఎక్కడ చూసినా టమాటోలు, దొండకాయలు వుంటాయి. పచ్చడికి రెండు కొబ్బరికాయలు తీసుకుంటే చాలదా. వెలక్కాయలు కూడా కొనాలా కొబ్బరికాయ దేవుడికూడా పనికొస్తుంది. వెలక్కాయ పచ్చడికి మాత్రమే పనికొస్తుంది.

కింగ్‌సైజు అరిటి కాయలు ఒక్కొటి యిద్దరికి కూరవుతుంది. నిమ్మకాయపెట్టి పోపువేసి చేస్తే-కాయ అర్ధణానో కానీనో వుండేది. అరిటి

పళ్ళు అర్ధణాకి అరడజను-వరల్డ్ వార్ నంబర్ టూ జరిగే రోజుల్లో మాట! వీశ అణన్నరా బేడా కూరలన్నీ, జావకాయలు, పంపర పనాస కాయలు, సీతాఫలాలు, చెరుకుగడలు బై దిబై తేగలు తంపట్లేసినవి (ఐ. ఏ. ఎస్. కుర్రాళ్ళు కూడా తాటి ముంజెలకీ తేగలకీ బుర్రగుంజుకి వున్న తేడా చెప్ప జాలరు) కాఫీహోటళ్ళ కల్చరొచ్చి తెలుగుదేశం మీదపడి రోడ్సైడు యీటింగుని కిల్ చేసి పారేసింది.

నాకు బాహా జ్ఞాపకం- అత్తిల్లోనూ, తణుకులోనూ మరేమో నిడద వోల్లోనూ మా మావయ్యగారి వెనకే పిల్లలందరం సంతల కెళ్ళేవాళ్ళం. కూరలు కొనడం ఒక ఆర్టూ. ఒక సైన్సూ కూడాను. మా మావయ్యగారికి పచ్చని కూరల పోగుల్ని చూసినా పళ్ళ దుకాణాల్ని చూసినా వెర్రివ్యామోహము పరమ ప్రీతీనూ. తినేవాళ్ళు వున్నారో లేదో చూసుకోకుండా కూరల్ని కొనేసేవారు. బేరవాడ్డం, కూరలు ఏరడం, మా కందరికీ వంకాయలు ఎలా ఏరాలో, బెండకాయలు ఎలా ఏరాలో, ఆనపకాయ లేతది అవునో కాదో తెలుసుకోవటం ఎలాగో అన్నీ చెప్పేవారు. దోసకాయలు గుట్టలుగా పోసినపుడు టొమాటోలు చాపలమీద తట్టలలోనూ పరిచినపుడు టెక్నికలర్ దృశ్యాలు చూస్తున్నట్లుగా మహదానందంగా వుండేది. కూరల తట్ట మా రైటానరబుల్ పనిమనిషి అప్పలమ్మ ఎత్తుకునేది. అప్పలమ్మ ఎప్పుడూ విచారంగా వుండేది. దాని కొడుక్కి పెళ్లాన్ని తాగొచ్చి అనుమానంమీద హత్య చేసినందుకు ఉరిశిక్ష వేశారు. వాడు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రాకుమారిడిలా తెగ బలిసిపోయి వుండేవాడు. వాడి ఉరి శిక్ష తప్పించమని అది (మాతృదేవత) లండన్లో ప్రివీకవున్సిలుకి అప్పీలు చేసుకుంది. ఆపైన కింగ్జార్జి ఫిఫ్తుకి కూడా మెర్సీ పెటిషన్ పెట్టుకుంది. కొడుక్కి ఉరితీసేరోజు దగ్గరవుతున్న కొద్ది అది మూర్తీభవించిన విషాదంలా డల్గా దీనంగా దిగులుగా వుండేది, అఫ్కోర్స్ రాజుగారు మెర్సీ పిటిషన్ శాంక్షన్ చేశారుకారు. దాని కొడుకుని ఉరేశారనుకోండి. సంతలో ఎర్రగా బుర్రగా మీసాలు జులపాలు తలపాగాతో తిరిగే కుర్రాళ్లంతా దానికి కొడుకుల్లా కనపడేవారు. దాని కోడలు చచ్చిపోయినందుకు మాకేమీ

విచారం అప్పట్లో కలగలేదు. హంతకుడైనా దాని కొడుకెందుకు చచ్చిపోవాలి—వాడికి ఉరిశిక్ష తప్పిపోతే బాగుండ్నని అనుకునేవాళ్లం. కన్నతల్లి దుఃఖం ముందు ధర్మాధర్మాలు న్యాయా న్యాయాలు మాకేవిటి తెలుస్తాయి. అంచేత మా కూరలతట్ట మోసే అప్పలమ్మ మరో ప్రపంచంలో వుంటూ వుండేది. మా మామయ్యగారు దానికి కూరల్ని మోసినందుకు అణా యిచ్చేవారు. దానికి లండన్‌కి మెర్సీ పిటిషన్ రాసిచ్చినది మా మామయ్యగారే.... దాని కొడుకుని ఉరి తీశాక దానికి షటిల్ ఫిలాసఫీ చెప్పారు. "కర్మణ్యేవాధి కారస్తే! మాఫలేషు కదాచన" అని పోయి అంట్లు తోముకో....అంట్లు తోముకున్నా, అఫీసుకెళ్ళినా, అప్పడాలొత్తుకున్నా, ఆవకాయపెట్టి కర్మలుచేయటం వరకే నీవంతు. ఫలితంతో నీకేమీ సంబంధములేదు. సవ్యసాచీ నిమిత్త మాత్రం భవ అని దానికి బోధ పర్చేవారు.

ఇంటికి తెచ్చాక తట్ట బోర్లించాలి కదా— అవును తట్ట బోర్లించాలి. అప్పుడు మా అత్తయ్యకీ, మా మావయ్యగారికి చిన్న వాగ్వివాదం జరిగేది కూరల గురించి. ఇన్నేం చేసుగుంటాం. యింతెందుకు తెచ్చారు. ఆకు కూరలు కుళ్ళిపోతాయి కదా అమ్మో ఆనపకాయ ఇంట్లో వుందే, గుమ్మడి కాయచెక్క తీసుకొస్తే సరిపోయేది కదా- యిలా యిలా ఆవిడ సణగటం ఆయన విసుక్కోటం—కాని మా పెద్ద ఓపిగ్గా ఆ కూరలన్నీ విడదీసి టైంటేబిల్ ప్రకారం వండమని చెప్పేవారు. మాకు అరటిపళ్ళు చక్కెరకడ్డీలు (కాణీకు రెండు-అని మీకు తెలీదులెండి. బెల్లపు జీళ్ళ మొహం ఎరగని వారికి చక్కెర కడ్డీలు ఎలా తెలుస్తాయి) జాంకాయలు పెట్టేవారు. మా మావయ్యగారు తేగల్ని బాగా కాలుస్తారు. అంతా సమంగా పంచుకుని తినే వాళ్ళం. సంతనించి తిరిగి యింటికి వచ్చేప్పుడు మళ్ళీ వచ్చే వారం థ్రిల్ కోసం పిల్లలంతా కాచుకూర్చునే వాళ్ళం పెళ్ళయిపోయాక పెళ్ళిపందిర్లా సంత అయిపోయాక సంత పాకలు దిగులుగా వెల వెలబోతూ నిర్మానుష్యంగా డల్‌గా కనిపించేవి. ఇప్పుడైనాసరే మా వారు సంతకెళ్దామంటే నేను రెడీ!